తల్లిని దూషించవద్దన్నందుకు...
తమ్ముడిని హత మార్చిన అన్న 6లో..

బీసీ డిక్లరేషన్‌ను
వెంటనే అమలు చేయాలి 8లో..



రామగుండంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ షటర్లు

వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన లబ్దిదారులు

నిరుపయోగంగా వాణిజ్య సముదాయం

- రామగుండంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వక తెరుచుకోని షెటర్లు
- ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం
- మూడేళ్లుగా అధికారుల చుట్టూ లబ్దిదారుల ప్రదక్షిణలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో మూడున్నరేళ్లుగా ఆధునికీకరించిన కార్పొరేషన్ షటర్లు నిరుపయోగంగా మారాయి. విద్యుత్ కనెక్షన్ ఇవ్వని కారణంగా, వాటి ద్వారా కార్పొరేషన్‌కు అద్దె రూపంలో రావాల్సిన ఆదాయంరాక పోగా, వాటిని కేటాయించిన లబ్ధిదారులకు మరొక చోట అవకాశం దొరకక ఉపాధి కోల్పోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలకు ఉపాధి కల్పించేందుకు గాను 1993లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలో 10 దుకాణ సముదాయాలను నిర్మించారు. వాటిని 1994 ఫిబ్రవరి 26వ తేదీన అప్పటి రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, అప్పటి ఎమ్మెల్యే మాతంగి నర్సయ్య ప్రారంభించారు. ఆ తర్వాత వాటిని కొందరు లబ్ధిదారులకు అద్దెకు ఇచ్చారు. కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత ఆ షటర్లకు సంబంధించి అద్దె చెల్లించలేక, కరెంట్ బిల్లులు చెల్లించలేక లబ్ధిదారులు వాటిని ఖాళీ చేశారు. అన్ని షటర్లు ఖాళీ కావడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

● రూ. ఎనిమిది లక్షల వెచ్చించి పునర్నిర్మాణం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2016 అక్టోబరు 11న పెద్దపల్లి జిల్లాగా ఆవిర్భవించింది. రామగుండంలో శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ కార్పొరేషన్ షటర్లను పరిశీలించిన అప్పటి అధికారులు వాటిని ఆధునికీకరించాలని నిర్ణయించారు. సుమారు ఎనిమిది లక్షల రూపాయలు వెచ్చించి 2020లో పునర్నిర్మాణం చేశారు. ఆ షటర్లకు ఎస్సీలకు కేటాయించేందుకు గాను నోటిఫికేషన్ జారీ చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, రామగుండం మండల పరిధిలో గల ఆసక్తి గల ఎస్సీలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దీంతో 30 మంది వరకు దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారులు కండ్లె రమేష్, దుర్గం రాజేశం, అల్లి గణేష్, చిలుక కుమారస్వామి, మొదుంపెల్లి రామస్వామి, కొత్తూరి విజయ్ కుమార్, కొత్తూరి ఉదయశ్రీ, గోడిశెల రాజేశ్, కంద మల్లయ్య, అరుకాల అమర్‌నాథ్‌లకు అదే ఏడాది సెప్టెంబరు 16వ తేదీన కేటాయించారు. ఒక్కో షటర్‌కు నెలకు 1,210 రూపాయలు చెల్లించాలని వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడు నెలల పాటు వరుసగా అద్దె చెల్లించకుంటే మాత్రమే వారిని అందులో నుంచి ఖాళీ చేయించి మరొకరికి కేటాయిస్తామని పేర్కొన్నారు. అయితే ఆ షటర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో ఉన్న విద్యుత్ కనెక్షన్లను విద్యుత్ శాఖాధికారులు తొలగించారు. కొన్ని బకాయిలు కూడా ఉన్నాయి. ఆధునికీకరించిన షటర్లకు తిరిగి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు తమకు కేటాయించిన షటర్లలో దుకాణాలను నడిపించలేని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ బకాయిలు క్లియర్ చేసి, కొత్త కనెక్షన్లు ఇప్పించి షటర్లు ఇవ్వాలని లబ్ధిదారులు మూడేళ్లుగా కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఎట్టకేలకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాత బకాయిలు 93 వేల రూపాయల బిల్లులు చెల్లించారు. అయితే ఆ దుకాణ సముదాయాన్ని ఇటీవల పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తమకట ఇవ్వమని చెప్పడంతో తామంతా కంగుతిన్నామని లబ్ధిదారులు తెలిపారు. సోమవారం వారంతా ప్రజావాణికి వచ్చి ఆ షటర్లకు గతంలో కేటాయించిన ప్రకారం తమకే కేటాయించాలని కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చి కోరారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎస్సీ కార్పొరేషన్ అద్దె రూపంలో ఐదు లక్షల 20 వేల రూపాయలు కోల్పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతంలో తమకు కేటాయించిన షట్టర్లను తమకే కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఎలిగేడులో ఓపెన్‌షెడ్‌కు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, జూలై 22: ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం డీఎంఎఫ్ నిధులు రూ.25లక్షలతో నిర్మించనున్న ఓపెన్‌షెడ్, జనరల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే తప్పకుండా నెరవేస్తుందన్నారు. నియోజకవర్గం లోని ప్రతీగ్రామాన్ని నందనవనం చేస్తామని ఆ దిశగా ప్రజాప్రతినిధులు అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, బూర్ల సత్యనారాయణ, తాటపల్లి రమేష్‌బాబు, మండిగ రాజనర్సు, గొల్లె భూమేష్, బాలసాని పర్శంగౌడ్, గోడెల శ్రీనివాస్‌రెడ్డి, గోపు లక్ష్మరెడ్డి, రంగు శ్రీనివాస్, కొండ తిరుపతిగౌడ్, పుల్లారావు, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 505 మంది అభ్యర్థులు హాజరు

పెద్దపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన డీఎస్సీ పరీక్షకు 550 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సోమవారం జరిగిన ఉపాధ్యాయ నియామకాల డీఎస్సీ పరీక్షకు మొత్తం 550 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 505 మంది అభ్యర్థులు హాజరయ్యారని, మంథని జేఎన్టీయూలో 200 మంది అభ్యర్థులకు 179 మంది అభ్యర్థులు, పెద్దపల్లిలోని మదర్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో 170 మంది అభ్యర్థులకు 158 మంది అభ్యర్థులు, ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 180 మంది అభ్యర్థులకు 168 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యాశాఖ పరంగా ఒక అబ్జర్వర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని డీఈఓ మాధవి తెలిపారు.

మహిళలు పోషకాహారాన్ని తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసన్న

కళ్యాణ్‌నగర్, జూలై 22: మహిళలు ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని పెద్దపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసన్న సూచించారు. సోమవారం గోదావరిఖని శ్రీనగర్‌కాలనీలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో స్పందన మైత్రి శ్రీ పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకురాలు శారద ఆధ్వర్యంలో నిర్వహించిన 'న్యాయ చట్టాలు, ఆరోగ్యం'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై, చట్టాలపై అవగాహన ఉండాలని, ఎవరైనా మహిళలు ఇబ్బంది పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కిషన్‌రావు, ప్రదీప్, విక్రమ్‌సింగ్, సాగర్, పోలీస్ అధికారులు సయ్యద్ రాయిస్, శ్రీరామ్, శ్రీనివాస్, షీటీమ్ సిబ్బంది స్నేహలత, సురేష్, ఎన్‌జీవోలు ఎస్కే రహ్మత్, ప్రేమ్‌కుమార్, రాజేందర్, సురేష్, రాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు





ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఎన్‌టీఆర్ నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జూలై 22: రామగుండం నియోజకవర్గంలో లో ఓల్టేజీ ప్రాంతాలను గుర్తించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశించారు. సోమవారం 46వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ఓల్టేజీ ఉన్న కాలనీల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు, ఇప్పటికే 42వ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. లో ఓల్టేజీ ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, దూళికట్ట సతీష్, పాతిపెల్లి ఎల్లయ్య, మీసాల సతీష్ పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమానికి పెద్దపీట..

కళ్యాణ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. సోమవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవించడానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాగా వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అధికారులు చేరువగా ఉండాలని సూచించారు.

ఖని జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవోలుగా చంద్రశేఖర్, అశోక్

కళ్యాణ్‌నగర్, జూలై 22: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా ఇద్దరు ఆర్ఎంవోలను నియమించారు. కమాన్‌పూర్‌లో పనిచేస్తున్న సివిల్ అసిస్టెంట్ అశోక్, గర్రెపల్లిలో పనిచేస్తున్న చంద్రశేఖర్‌లను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవోలుగా నియమించగా వారు సోమవారం విధుల్లో చేరారు.

ఎన్‌టీపీసీ బూడిద టెండర్లను అడ్డుకుంటాం

జ్యోతినగర్, జూలై 22: ఎన్‌టీపీసీ బూడిద టెండర్లను అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ జ్యోతినగర్ అధ్యక్షుడు ఆసిఫ్‌బాష పేర్కొన్నారు. ఈనెల 24న తెలంగాణ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్కలపల్లి శివారు, కుందన్‌పల్లి యాష్‌పాండ్‌లో ఉన్న బూడిదను విక్రయించేందుకు యాజమాన్యం టెండర్లు ఆహ్వానించినట్టు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా యాష్‌పాండ్ నిర్మించారని, యాష్‌పాండ్ కారణంగా చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైనట్టు పేర్కొన్నారు. ఎల్కపపల్లి కూడా మరో కుందన్‌పల్లిగా మారే ప్రమాదం ఉన్నదని, ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈనెల 24న జరగనున్న టెండర్ ప్రక్రియను నిలిపివేయాలని ఆసిఫ్‌బాష డిమాండ్ చేశారు.

సుల్తానాబాద్ పెద్ద చెరువుకు జలకళ



నిండుకుండలా సుల్తానాబాద్ పెద్ద చెరువు

సుల్తానాబాద్, జూలై 22: ఇటీవల కురిసిన వర్షాలకు సుల్తానాబాద్ పెద్ద చెరువుకు పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. నిండు కుండలా ఉన్న ఈ చెరువు జలకళ సందరించుకుంది. వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సరైన వర్షాలు లేక ఇటు ప్రజలు, అటు రైతులు తీవ్ర ఉక్కపోతను అనుభవించారు. మరోవైపు రైతులు తమ వ్యవసాయ పనులు ప్రారంభించుకోవడానికి కూడా వీలులేని దుస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాల మూలంగా సుల్తానాబాద్ పట్టణంలోని అన్ని చెరువులు కుంటలతో పాటు మండలంలోని చెరవులు కుంటలు కూడా నీటితో నిండిపోయాయి. మండలంలోని గర్రెపల్లి చెరువు కూడా జలకళను సంతరించుకుంది. సోమవారం రోజున వర్షాలకు విరామం రావడం కొంత ఎండ రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నాలుగు రోజులుగా తడిసి ముద్దయిన గ్రామాలు తేరుకున్నాయి. రైతులు నాట్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజావాణిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూలై 22: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఓదెల మండల కేంద్రానికి చెందిన పి విజయలక్ష్మి గ్రామ శివారులో సర్వే నంబర్ 426లో పట్టా భూమిలో మెగ్గు రమాదేవి చేపట్టిన అక్రమ నిర్మాణానికి ఇంటి నంబర్ కేటాయించవద్దని, దానిని కూల్చివేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం పట్టణానికి చెందిన సిద్ది భీమయ్య జంగాలపల్లి గ్రామం సర్వే నంబర్ 218లో 16 గుంటల తన భూమిలో బాదె సాంబయ్య అనే వ్యక్తి బాత్ రూమ్ నిర్మించు కున్నాడని, దానిని పూర్తిగా కూల్చివేసి భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు రామగుండానికి చెందిన జి నాగలక్ష్మి తన భర్త 2020 ఏప్రిల్ 2న మరణించాడని, తన భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పటివరకు రాకపోవడంతో తనకు వితంతువు పెన్షన్ రావడం లేదని, తనకు వెంటనే తన భర్త డెత్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలైన గృహజ్యోతి, ఐదు వందల రూపాయల గ్యాస్ సిలిండర్ లబ్ధి చేకూరని అర్హులు ఎవరైనా ఉంటే గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదుతో ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా తమ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దపల్లిటౌన్, జూలై 22: లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో పెద్దపల్లి జెండా చౌరస్తా వద్ద గల అమర్‌చంద్ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి నాయకులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు కంటి చూపు మందగించిన వృద్ధులకు, ఆపరేషన్ అవసరం ఉన్న వారిని బస్సులో రేకుర్తి హాస్పిటల్‌కి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం తిరిగి వారిని గమ్యస్థానాలకు చేర్చుతామన్నారు. ఆఅవకాశాన్ని పట్టణం, పరిసర మం డలాలు, గ్రామాల్లోని ప్రతీఒక్కరికి చేరేలా తెలియజేయా లని సూచించారు.

నేడు పత్తిపాకలో మెగా వైద్య శిబిరం

ధర్మారం, జూలై 22: ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో నేడు మంగళవారం ప్రత్యేక మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి సుష్మిత తెలిపారు. ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వైద్య శిబిరం ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బండారి శ్రీనివాస్ తండ్రి చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

వరద ముంపు నుంచి తప్పించేందుకు చర్యలు



వరద కాలువ పూడికతీత పనులు చేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు

సుల్తానాబాద్, జూలై 22: పట్టణాన్ని వరద ముంపు నుంచి తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు తెలిపారు. ప్రతీ వానాకాలంలో సుల్తానాబాద్ పట్టణాన్ని వరదల్లో ముంచెత్తిస్తున్న వరద కాలువ పూడికతీత పనులు మున్సిపల్ అధికారులు సోమవారం చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు సోమవారం వరద కాలువను పరిశీలించారు. ఈ కాలువ ఆక్రమణలకు గురైందని తద్వారా వరదనీరు సాఫీగా వేళ్లేందుకు తీవ్ర ఆటంకాలు ఎదురువుతున్నాయని పలువురు ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. పట్టణంలోని అజీజ్ కుంట, బ్రాహ్మణకుంట నుంచి ప్రతీ వర్షాకాలంలో పెద్దఎత్తున వరదనీరు, గాంధీనగర్‌లోని కరీంనగర్ రోడ్డులోని పెంట్రోల్‌బంక్ పక్కనున్న పెద్ద వరద కాలువ ద్వారా సుల్తానాబాద్ చెరువులోకి వస్తాయి. ఆలాంటి ప్రాధాన్యం ఉన్న వరద కాలువను గాంధీనగర్ నుంచి పూసాల రోడ్డు వరకు కొంత మంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేయడంతో ప్రతీయేటా సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్నకాలనీ మొదలు జవహర్ నగర్, పూసాల రోడ్డు తదితర లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయి. ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఆనేక అసౌకర్యానికి వదర నీరు ఇళ్లలోకి చేరి అనేక విధాలు నష్టపోయారు. దాంతో సోమవారం వరద కాలువ వెంట ఎక్స్‌కావేటర్‌తో పూడికతీత పనులు ప్రారంభించారు.

● ఆక్రమణలు తొలగిస్తాం..

ఈ వర్షాకాలంలో వరద ముంపు రాకుండా ఉండేందుకు ముందస్తుగా వరద కాలువ పూడిక తీయిస్తున్నామని మునిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. ఈ వరద కాలువ ద్వారా వరద నీరు సుల్తానాబాద్ చెరువులోకి ఎలాంటి ఆటంకాలు లేకుండా కాలువ క్లియర్ చేయిస్తామన్నారు. అడ్డుగా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని ఆక్రమణలదారులకు తెలిపామన్నారు. స్పందించకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. పట్టణంలో ఎలాంటి వరద ముంపు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు.

పదోన్నతి బాధ్యతలను పెంచుతుంది: సీపీ

కోల్‌సిటీ, జూలై 22: పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఏడుగురు ఏఎస్ఐలు ఎస్ఐగా, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్ల ఏఎస్ఐగా, 16మంది కానిస్టేబుళ్ల హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి పొందగా వారికి చిహ్నాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పదోన్నతితో పాటు బాధ్యత కూడా పెరుగుతుందని, బాధ్యతలను క్రమశిక్షణగా నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్‌శాఖపై నమ్మకాన్ని కలిగించే విధంగా ఉండాలని సూచించారు. కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో అశోక్ కుమార్, ఆర్ఐలు దామోదర్, మల్లేషం, మధు, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, సందీప్, మనోజ్, సంధ్య, సీసీ గౌస్,పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన పోలీసులతో సీపీ శ్రీనివాస్

తల్లిని దూషించవద్దన్నందుకు..

● తమ్ముడిని హత మార్చిన అన్న ● తండ్రిపైనా దాడి ● గోదావరిఖనిలో దారుణం



చికిత్స పొందుతున్న తండ్రి ఓదెలు

కోల్‌సిటీ, జూలై 22: మద్యం సేవించి వచ్చి తల్లిని అసభ్యపదజాలంతో దూషిస్తున్న అన్నను వారించినందుకు తమ్ముడిని హత మార్చిన ఘటన సోమవారం రాత్రి గోదావరిఖని కృష్ణ నగర్‌లో చోటు చేసుకున్నది. కృష్ణనగర్‌లో నివాస ముండే ఆత్మకూరి సునీల్(27)ను అతని నివా సంలోనే అతని అన్న ఆత్మకూరి అనిల్ కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డు వచ్చిన అతని తండ్రి ఓదెలును కూడా పొడిచాడు. ఘటనకు సంబం ధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అంతర్గాం మండలం పెద్దం పేటకు చెందిన ఆత్మకూరి ఓదెలు కుటుంబం కొన్నేళ్ల క్రితం గోదావరిఖనికి వచ్చి స్థిరపడింది. అతడు టెంట్‌హౌస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి అనిల్, సునీల్(27) కుమారులు ఉన్నారు. సునీల్ శ్రీకళ ను ప్రేమ వివాహం చేసుకోగా విజయరాం(3), వియ(2) పిల్లలు ఉన్నారు. అనిల్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుండగా సునీల్ బస్టాండ్ వద్ద హోటల్ నడుపుతున్నాడు. అనిల్ గతంలో హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న సమయంలో ఒక వివాహితను ప్రేమించానని, ఆమెతో తన పెళ్లి జరిపించాలంటూ తల్లి రాజమ్మపై ఒత్తిడి తీసుకు వచ్చేవాడు. మద్యానికి బానిసైన అనిల్ తండ్రి టెంట్‌హౌస్‌లోని సామగ్రిని కూడా అమ్ముకుని మద్యం సేవించేవాడు. చిల్లర దొంగతనాలకు సైతం పాల్పడేవా డు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన అనిల్ తల్లి రాజమ్మతో గొడవ పడి అసభ్యపద జాలంతో దూషిం చాడు. అదే సమ యంలో ఇంటికి వచ్చిన తమ్ముడు సునీల్ అడ్డు చెప్పడంతో కత్తితో దాడికి పాల్ప డ్డాడు. విచక్షణ రహితంగా పొడవ డంతో సునీల్ కుప్పకూలాడు. అడ్డు వెళ్లిన తండ్రి ఓదెలును కత్తితో పొడిచాడు. అతడు కూడా గాయపడ్డాడు. తీవ్రగాయాల పాలైన సునీల్‌ను గోదావరిఖని ప్రభుత్వాసు పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.



సునీల్ (ఫైల్)

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

రాయికల్, జూలై 22: మండలంలోని మూటపెల్లి గ్రామానికి చెందిన మ్యాకల భూమరాజు(45) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భూమరాజుకు భర్త రాజంతో 20 సంవత్సరాల క్రితం విడాకులు అయ్యాయి. కొడుకు కూడా తండ్రితో పాటు ఉండగా భూమరాజు ఒంటరిగా జీవిస్తోంది. కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

రాయికల్, జూలై 22: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన నందగిరి గంగారాం పెద్ద కుమార్తె శివానీ (18) డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఈ నెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు శివానిని మొదట జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈ నెల 21న హైదరాబాద్ నుంచి జగిత్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శివానీ కుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు.

ఒకరి అరెస్టు

చందుర్తి జూలై 22: గంజాయి కేసు అరెస్ట్ నుంచి తమ్ముడిని తప్పించడానికి తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి ప్రోత్సహించిన కేసులో అన్నను అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్‌పై వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 31 జనవరి 2024న గంజాయి సరఫరా చేసిన సంఘటనలో కేసు నమోదైంది. ఈ నెల 17న చందుర్తి పోలీసులు అఖిల్‌ను అదుపులోకి తీసుకొని, వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. అఖిల్‌ను వేములవాడకు తరలిస్తుండగా తమ్ముడినిని అరెస్టు నుంచి తప్పించడానికి అన్న రాకేష్ అగ్గిపెట్టెలో బ్లేడు తీసుకువచ్చి తమ్ముడైన అఖిల్‌కు ఇచ్చాడు. అఖిల్ బ్లేడుతో చెయ్యి, కాలు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన రాకేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై పడిన చెట్టును తొలగించిన పోలీసులు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వీర్నపల్లి, జూలై 22: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఎల్లారెడ్డిపేట - వీర్నపల్లి ప్రధాన రహదారిపై కంచర్ల శివారులో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎల్లాగౌడ్ సిబ్బందితో కలిసి రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించారు. వాహనదారులకు సమస్యలు తలెత్తకుండా చేశారు.

మారుమూల గ్రామాలకు అదనపు బస్సులు నడపాలి



గర్జనపల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

వీర్నపల్లి, జూలై 22: మారుమూల అటవీ గ్రామాలకు అదనంగా బస్సులు నడపాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జల ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్జనపల్లిలో ప్రధాన రహదారిపై విద్యార్థులు, గ్రామస్థులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సిరిసిల్ల నుంచి వన్‌పల్లి వరకు ఉదయం, సాయంత్రం ఒకసారి బస్సును నడపడంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. నాయకులు దేవేందర్, రాజన్న, అభిషేక్, రవి, సునీల్, బాబు పాల్గొన్నారు.

ఎనిమిది ఆటోలు సీజ్

కరీంనగర్ క్రైం, జూలై 22: కరీంనగర్‌లో మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌లు లేని ఎనిమిది ఆటోలను సీజ్ చేశారు. ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈ వాహన తనిఖీలు నిర్వహించగా టౌన్ ఏసీపీ జి.నరేందర్ పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారం అన్ని ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు పేర్కొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి

● సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల రిలే దీక్షలు

సిరిసిల్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, వస్త్ర సంక్షోభాన్ని నివారించాలని వస్త్రోత్పత్తిదారులు, కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. సోమవారం సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణ, విద్యుత్ సమస్య పరిష్కారం, నేతన్నలకు ఉపాధి కల్పన, పెండింగ్ బకాయిల విడుదలకు జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. నేతన్న పోరుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని సీఐటీయూ ప్రకటించగా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో యాత్ర వాయిదా వేశామన్నారు. 20 రోజులైనా ప్రభుత్వం నుంచి చలనం లేదన్నారు. రిలే దీక్షలకు మద్దతుగా మంగళవారం రాస్తారోకో, 25న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదారాబాద్ చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ విధించి పరిశ్రమ సంక్షోభానికి కారణమైందన్నారు. ఓవైపు సమస్యను సృష్టిస్తూ సానుభూతి ప్రద ర్శించడం సరైన పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నేతన్నల మీద ప్రేమ ఉంటే ప్రధానితో మాట్లాడి కేంద్రం నుంచి వస్త్రాల ఆర్డర్లను ఇప్పించాలని అన్నారు. అనంతరం దీక్షలకు బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు నరేష్, సదానందం, రాజు, శ్రీకాంత్, ప్రకాష్



దీక్షలను ప్రారంభిస్తున్న పవర్‌లూం వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ , సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాణీరుద్రమ మాట్లాడుతూ బతుకమ్మ చీరల బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలన్నారు. నేతన్నలకు విద్యుత్ సబ్సిడీతోపాటు సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సిరిసిల్ల ఉత్పత్తులు ఒకప్పుడు బ్రాండ్‌లాగా ఉండేవని, సొంతంగా మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేదని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరల పేరిట ఆదుకుంటామని చెప్పి నాసిరకం చీరలను ఉత్పత్తి చేయించార న్నారు. కార్మికులకు రూ.15 వేల కూలి దొరికేదని, బతుకమ్మ చీరలతో కొంతమంది ఆసాములు లాభపడ్డారని అన్నారు. ప్రభుత్వం బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని, ఆర్డర్లను అందించాలని కోరారు. మొదటి రోజు రిలే దీక్షల్లో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, కాటన్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనా రాయణ, అసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీ యూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వేణు, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, యారన్ అసోసి యేషన్ అధ్యక్షుడు పిస్క మధు, డైయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్య దర్శి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, వస్త్ర వ్యాపార సంఘం కోశాధికారి శ్రీగాధ విష్ణు, డైరెక్టర్లు అన్నల్‌దాస్ శ్రీనివాస్, బొడ్డు శ్రీధర్, పాలిస్టర్ అసోసియేషన్ కోశాధికారి మండల బాలరాజు, శ్రీరాం సత్యం, మండల రాజు, గాజుల లింగం దీక్షల్లో కూర్చున్నారు. దీక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మండల సత్యం తదితరులు ప్రారంభించారు.

చెరువులో పడి బాలుడి మృతి


సాయికృష్ణ(ఫైల్)

తిమ్మాపూర్, జూలై22: మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో ప్రమాదవ శాత్తూ చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళిపాలెం గ్రామానికి చెందిన జువ్వాజి మురళి, పద్మల ఏకైక కుమారుడు జువ్వాజి సాయికృష్ణ(12) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన సాయికృష్ణ మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలోని ముగ్గురు స్నేహితులు కలిసి పాఠశాల వెనకాల గల ఊర చెరువు వద్దకు సైకిల్‌తో ఆడుకుంటూ వెళ్లాడు. చెరువు సమీపంలో సాయికృష్ణ బహిర్భూమికి వెళ్లి చెరువు మెట్ల వద్ద నీటి వద్దకు వెళ్లాడు. ప్రమాదవ శాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. సాయికృష్ణతో వచ్చిన మిత్రులు గమనించి స్థానికంగా పొలంలో ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికితో పాటు సాయికృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే చెరువులోకి దిగి వెతకగా మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఇద్దరు నేరస్తులపై పీడియాక్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కోరుట్ల, జూలై 22 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సోమవారం వెల్లడించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని ఝాన్సీరోడ్డుకు చెందిన విత్తనాల నాగరాజు, అర్బన్ కాలనీకి చెందిన గుడ్ల విశాల్‌లపై ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కోరుట్ల పట్టణంతో పాటు కరీం నగర్ ఉమ్మడి జిల్లాలో హత్య కేసులు, సుపారి హత్యలు, బలవంతపు వసూళ్లలో నిందితులుగా ఉన్న నాగరాజు, విశాల్‌లపై పీడీ యాక్ట్‌ను విధించగా వారు ప్రస్తుతం హైదరాబాదులోని చెర్లపల్లి జైలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు వివరించారు.

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

గంగాధర, జూలై 22: గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్న యాజమానిపై జిల్లా లేబర్ ఆఫీసర్ గుండేటి చక్రధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లేబర్ ఆఫీసర్ నేతృత్వంలోని బృందం గంగాధర మండలంలో ఆపరేషన్ ముస్కాన్10లో భాగంగా తనిఖీలు చేపట్టారు. మధురానగర్ చౌరస్తాలో రాజస్థాన్‌కు చెందిన సురేష్ చంద్ర గుజ్జర్ అనే అతను తన పానిపూరీ బండి వద్ద 11 సంవత్సరాల బాలుడిని పనిలో పెట్టుకున్నాడు. బాలుడి వివరాలు సేకరించిన జిల్లా లేబర్ ఆఫీసర్ యాజమాని పనిలో పెట్టుకున్నట్లు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాష్‌పాండ్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా నేడు

కోల్‌సిటీ, జూలై 22: ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా యాష్ పాండ్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్రభావిత గ్రామాలైన ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, లక్ష్మీపూర్, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్ గ్రామస్తులు రిజర్వాయర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాలను కాదని ఆన్‌లైన్ బూడిద టెండర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిరాఅఉ. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిజాయితీ చాటుకున్న మహిళ



మహిళను సన్మానిస్తున్న ఎస్సై

రామగిరి, జూలై 22: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన నీర్ల విజయ అనే గృహిణి తనకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను అప్పగించి సోమవారం తన నిజాయితీ చాటుకుంది. గ్రామానికి చెందిన చెల్పూరి రాజమౌళికి చెందిన రూ.80వేల విలువ గల సెల్‌ఫోన్ ప్యాంట్ జేబులోంచి దారిలో పడిపోయింది. సదరు మహిళ సెల్‌ఫోన్ దొరికిన వివరాలను మాజీ జెడ్పీటీసీ గంటవెంకట రమణరెడ్డికి తెలుపగా పోలీస్‌స్టేషన్ అప్పగించాల్సిందిగా సదరు మహిళకు సూచించారు. అదే గ్రామానికి చెందిన రాజమౌళిదిగా పోలీసులు గుర్తించి అప్పగించారు. సదరు మహిళను ఎస్ఐ సందీప్ అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన మామిడిపల్లి వంశీ (27) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశీ ఒక అమ్మాయిని ప్రేమించాడని, ఆమెను పెళ్లి చేసుకుంటానని ఇంట్లో తెలుపగా తిరస్కరించినట్లు తెలిపారు. ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని ఆందోళన చెంది ఈ నెల 14న గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద పురుగుల మందు ఆత్మహత్యాయత్నం చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతుడు వంశీ సమాచారం ఇవ్వడంతో పెద్దపల్లి ఆసుపత్రికి అక్కడి నుండి కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లోనూ తనిఖీ ● చెడిపోయిన వస్తువులను పడేసిన అధికారులు

మల్యాల, జూలై 22: మల్యాలలోని బేకరీలు, తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. కాలం చెల్లిన వస్తువుల వినియోగం, బూజు వచ్చిన తినుబండారాల అమ్మకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మల్యాలలో గల బేకరీల్లో బూజు వచ్చిన కేకులు, కాలం చెల్లిన బిస్కట్లు, ఆరోగ్యానికి హాని చేసే రంగుల క్రీమ్‌లు లభించడంతో ఆహార తనిఖీ అధికారి ఆర్.అనూష మండిపడ్డారు. చిన్నపిల్లలు తినే ఇలాంటి వాటిని శుచి, శుభ్రతతో కాకుండా అధ్వాన్నంగా బూజు వచ్చిన వాటితో తయారు చేసి అమ్మడం ఏమిటని, ఆహార విక్రయాలకు సంబంధించి సర్టిఫికెట్లు తీసుకోకపోవడంపై నిర్వాహకులను నిలదీశారు. వారం రోజుల్లోగా తీరు మార్చుకోవాలని లేనిచో సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూజు వచ్చిన కేక్‌లు, బిస్కట్ పాకెట్లు, రంగుల పొడిలు ఇతర వస్తువులు పడేశారు. అంతకు ముందు తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో తనిఖీలు చేసి చెడిపోయిన ఉల్లిగడ్డలను వంటలలో వినియోగించడం, ఆదివారం నాటి మటన్ సోమవారం వండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


కుళ్లిపోయిన పదార్థాలను పడేసిన అధికారులు

రైస్ మిల్లుల్లో అధికారుల విస్తృత తనిఖీలు

● ఇతర జిల్లాల సివిల్ సప్లయ్ అధికారులకు బాధ్యతలు


జగిత్యాలలో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు


కాల్వశ్రీరాంపూర్‌లోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని సాయిసుధ ఇండస్ట్రీస్, కొత్త శ్రీయాన్ రైస్ మిల్లు, సిరికొండ జీఎస్‌కే ఇండస్ట్రీస్, కొండికర్ల మహాలక్ష్మి ఇండస్ట్రీస్, పెద్దాపూర్ నిజాం ఆగ్రో ఇండస్ట్రీస్, చెప్యాల్ శ్రీ లక్ష్మీ సరస్వతీ ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ సాయి ఇండస్ట్రీస్, గగన్ ట్రేడర్స్ ఇండస్ట్రీస్, నూకపల్లి గునా ఇండస్ట్రీస్, చందోల్ మాధవి ఆగ్రో ఇండస్ట్రీస్, శివ సాయి ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీమన్ననారాయణ ఇండస్ట్రీస్, మణికంఠ ఆగ్రోటెక్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, జగిత్యాల జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయి కార్పోరేషన్ మేనేజర్ హతీరాం, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, ఈజీఎస్ ఏపీడీ మధన్ మోహన్, తహసీల్ధార్లు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● **కాల్వ శ్రీరాంపూర్** : మండలంలోని మంగపేట గ్రామంలోని అన్నదాత ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సోమవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, సేల్స్ రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్, డీఎం శ్రీకాంత్, డీటీసీఎస్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎఫ్ఐ మల్లికార్జునరావు, ఆర్ఐ రాజేందర్, స్థానిక ఎస్సై ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల బదిలీలు

కరీంనగర్ క్రైం, జూలై 22: జిల్లా అటవీశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన పలువురు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు స్థానచలనం జరిగింది. కరీంనగర్ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో) గంటల శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో తాడ్వాయిలో పనిచేస్తున్న ఎఫ్ఆర్‌వో షౌకత్‌హుస్సేన్ నియామకమయ్యారు. హుజూరాబాద్ ఎఫ్ఆర్ రాజేశ్వర్‌రావు భూపాలపల్లి జిల్లా కొయ్యూర్ రేంజ్‌కు బదిలీ అయ్యారు. గంగాధర డిప్యూటీ ఎఫ్ఆర్‌వో కిరణ్మయి కరీంనగర్ స్ట్రైకింగ్‌ఫోర్స్‌కు, సిరిసిల్ల డిప్యూటీ ఎఫ్ఆర్‌వో బాపిరాజం గంగాధరకు బదిలీ అయ్యారు. చొప్పదండి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వి వేణుభరణ్ కరీంనగర్‌కు, శంకరపట్నంలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో సరిత కామారెడ్డికి, వేములవాడలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ చొప్పదండికి బదిలీ అయ్యారు. జమ్మికుంటలో పనిచేస్తున్న ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్ అనంతరాం గంగాధరకు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సమీనాసర్వీన్ తిమ్మాపూర్‌కు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సుజాత కరీంనగర్ డీర్‌పార్క్‌కు బదిలీ అయ్యారు.

ఫేక్ ఐడీతో మహిళలకు చాటింగ్

రుద్రంగి, జూలై 22 ఓ యువకుడి ఫొటోను స్నాప్ చాట్‌లో ప్రొఫైల్‌గా పెట్టి ఫేక్ అకౌంట్‌తో మహిళలకు చాటింగ్ చేసిన సంఘటన రుద్రంగిలో వెలుగుచూసింది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దినేష్ అనే యువకుడి ఫొటోను స్నాప్‌చాట్‌లో ప్రొఫైల్ పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశారు. దీంతో మహిళలకు అసభ్యకరంగా చాటింగ్ చేస్తున్నారని, స్నాప్‌చాట్ ఫేక్ ఆకౌంట్‌తో చాటింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దినేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

సబ్బితం జలపాతం సందర్శనకు రావద్దు


జలపాతం సందర్శనకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎంపీవో

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టు సింగారం గౌరిగుండాల జలపాతం సందర్శన నిషేధించామని సందర్శకులు ఎవరూ రావద్దని ఎంపీవో సుదర్శన్ సూచించారు. సోమవారం మండలంలోని రంగాపూర్ నుంచి సబ్బితం వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం గౌరిగుండాల జలపాతాన్ని ఎంపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శనకు పలువురు యువకులు రాగా జలపాతానికి వరద ఎక్కువగా వస్తుందని, ఈ సందర్భంగా సందర్శనను నిషేధించినట్లు వారికి తెలిపి వెనక్కి పంపించారు. సందర్శకులు, యువకులు గమనించి సహకరించాలని ఎంపీవో సుదర్శన్ సూచించారు. వారి వెంట ఏపీవో రమేష్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఇండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 20,023 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి రాక పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,023 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం సోమవారం 21.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 42.534 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుం చి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 15.108 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

కోటిలింగాల వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

వెల్లటూర్, జూలై 22: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. వాగులు, వంకలు పొంగి గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 3389 క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలోకి వరద నీరు చేరి నీటి మట్టం పెరుగుతోంది.

గంజాయి విక్రయదారుల అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 22: ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల వద్ద గంజాయి విక్రయిస్తున్న తాళ్లపల్లి గ్రామానికి చెందిన తలపల్లి నాగిరెడ్డి (24), కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గుర్రాల నిఖిల్‌రెడ్డి(19)లు అనే యువకులను అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సిరిసిల్ల సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఆయన అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలంలోని తాళ్లపల్లి గ్రామా నికి చెందిన నాగిరెడ్డి అనే యువకుడు కరీంనగర్‌లోని వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ గుర్రాల నిఖిల్‌రెడ్డితో పరిచయం ఏర్పడిందన్నారు. ఇద్దరు యువకులు గంజాయి తాగడానికి అలవాటు పడి మరికొందరికి విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఇల్లంతకుంటకు వస్తున్నారనే సమాచారం మేరకు మార్గమధ్యలో వంతడ్పుల వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా 100 గ్రాముల గంజాయి లభించిందన్నారు. దీంతో 100 గ్రాముల గంజాయిని, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే డయల్ 100 లేదా 8712656392కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.


అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల పోలీసులు



పెద్దపల్లి బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

పెద్దపల్లి టౌన్: గంజాయి మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సోమవారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేప ట్టారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీంచారు. బస్సులు, ట్రైన్‌లలో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు చేశారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటిని అరికట్టడం, రవాణా, నియంత్రణలో భాగంగా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్, పార్శిల్ సర్వీస్ కేంద్రాలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతీ పార్శిల్, రవాణా బ్యాగులను, ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు చేపడుతామని తెలిపారు.

కాళేశ్వరం తెలంగాణకు జీవధార

● ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న కొప్పుల

కరీంనగర్ టౌన్, జూలై 22: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే చరిత్రహీనులవుతారని ఆయన హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఆయన నివాసగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిండుకుండలా మేడిగడ్డ బ్యారేజీ మారిందన్నారు. కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయిందని, కాళేశ్వరం కొట్టుకు పోయిందంటూ కాంగ్రెస్ పార్టీ, యూట్యూబ్ చానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేసినా వాళ్ల కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తోందని అన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ ఇన్‌ఫ్లో 8 లక్షల 20వేల క్యూసెక్కులుంటే అవుట్ ఫ్లో 8 లక్షల 20 వేల క్యూసెక్కులని చెప్పారు. 85 గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదులుతున్నారని అన్నారు. ఆరు రోజుల్లో 73 టీఎంసీల నీరు సముద్రం పాలైందని అన్నారు. 7వ బ్లాక్‌లోని 20,21వ పిల్లర్‌లు సురక్షితంగా ఉన్నాయని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూసివేస్తేనే ప్రాజెక్టు గురించి తెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ వింతవాదన చేస్తోందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డిలు చెబితే గేట్లు తెరవడం కానీ, మూయడం కానీ జరుగదని,అది నీళ్ల వరద మీద ఆధారపడి ఉంటుందన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

గంగాధర,జూలై 22: గంగాధరలో మోడల్ స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు మొరాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం గంగాధర మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెల్లుతున్న ఆర్టీసీ బస్సు మధురానగర్ చౌరస్తాలో నిలిపి విద్యార్థులను ఎక్కించుకునే తరుణంలో ఆగిపోయింది. డ్రైవర్ బస్సును స్టార్ట్ చేద్దామని అరగంట ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. చేసేది లేక విద్యార్థులు వెనక నుంచి నెట్టినా ఎంతకీ స్టార్ట్ కాలేదు. దీంతో మరో బస్సును రప్పించి విద్యార్థులను పాఠశాలకు చేర్చారు. అరగంట పాటు ఆచంపల్లి, గరకుర్తి, తాడిజెర్రి, రంగరావుపల్లి, కురిక్యాల, మధురానగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్తామా లేదా అని ఆందోళన వ్యక్తం చేశారు.


నిలిచిపోయిన బస్సును నెట్టుతున్న విద్యార్థులు

రూ.7,260 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7260 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 81క్వింటాళ్లు విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7260, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా, తహసీల్దార్లకు వినతి

పెద్దపల్లి రూరల్, జూలై 22: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా బీజేపీ నాయకులు పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడు తూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారని తెలిపారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఖాతాల్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారన్నారు. అధికారంలోకి ఎనిమిది నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఓబీసీ డిక్లరేషన్ ప్రక్రియ ప్రభుత్వం వెంటనే వారం రోజుల్లో ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్‌ల వద్ద నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్, కౌన్సిలర్ రాజమహంత కృష్ణ, నాయకులు పోల్సాని సంపత్‌రావు, జీవన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీకాంత్ , వేల్పుల రమేష్, సోడా బాబు, గాండ్ల రాజేశం, కుక్క వంశీ, పిట్ట వినయ్, గాదాసి సతీష్, ఉమేష్ పాల్గొన్నారు.

మంథని: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని ఓబీసీ మోర్చా ఆదేశాల మేరకు బీజేపీ నేతలు సబ్బని సంతోష్‌కుమార్, రాజేందర్‌లు సోమవారం ఆర్డీవో హనుమా నాయక్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కొండపాక సత్య ప్రకాశ్, బోగోజు శ్రీనివాస్, పోతరవేణి క్రాంతికుమార్, నాంపల్లి రమేష్, చిలువేరు సతీష్‌కుమార్, చిదురాల మధుకర్, బూడిద రాజు, బొల్లంపల్లి లక్ష్మణ్, సామల అశోక్, ఎడ్ల సాగర్, ఎల్కా సదానందం, ప్రభాకర్, విష్ణు, రేపాక శంకర్, షరీఫోద్దీన్ పాల్గొన్నారు.

ఓదెల: బిసి డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడంపై నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ యాకయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కారంగుల శ్రీనివాస్, బీసీ మోర్చా అధ్యక్షుడు పేరవేణి సతీష్, దళిత మోర్చా అధ్యక్షుడు సకినాల కృష్ణ, నాయకులు రామినేని ప్రసాద్, శివ, నిఖిల్, అశోక్, శ్రీనివాస్, అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ఎన్నికల సందర్భంగా ప్రకటించిన బీసీ డిక్లేరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎస్ఐ శ్రావణ్ తదితరులు ఆఫీసు కు చేరుకుని బీజేపీ నేతల ఆందోళన విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, ఓబీసీ ఇన్‌చార్జి చిట్టవేని సదయ్య, నాయకులు జిల్లా ఇన్‌చార్జి రంగుల శంకర్, ఎనగందుల సతీష్, తిరుపతి, ఒజ్జ సతీష్, వెంకటేష్, ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేసి, బీసీలకు తగిన నిధులు కేటాయించాలని పాలకుర్తి మండల బీజేపీ శ్రేణులు తహసీల్దార్ ఎం జ్యోతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు బాలసాని మల్లేషం గౌడ్,తిప్పని రాజ్‌కుమార్,కడారి నర్సయ్య,నగేష్, గోపు రామన్న, కొలిపాక శంకరయ్య, కోదురి శంకర్, గట్టయ్య, జట్టుట్ తిరుపతి, కుమార్, శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, నాయకులు కోదూరి చంద్రమౌళి, నగునూరి లక్ష్మీనారాయణ, భూసారపు రవీందర్‌గౌడ్, గడ్డం తిరుపతిరెడ్డి, కోదూరి రాజేశ్వర్, బొంగాని అంజన్న, మోహన్‌రెడ్డి, వెంసాని ఐలయ్యయాదవ్, పాటకుల శ్రీనివాస్, ప్రకాష్ పాల్గొన్నారు.





పెద్దపల్లిలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, ఓదెలలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

-పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి



ప్రతిజ్ఞ చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకురాళ్లు

జ్యోతినగర్, జూలై 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి ఆరోపించారు. ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం ప్రగతిశీల మహిళాసంఘం పట్టణ అధ్యక్షురాలు బి.సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా కోడిపుంజుల జ్యోతి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు మరింత పెరిగాయన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమభాగం కోసం పీఓడబ్ల్యు అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈనెల 28న గోదావరిఖని కార్యాలయంలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళాసంఘం నాయకులు శంకరమ్మ, లక్ష్మి, పద్మ, స్వరూప, సంధ్య, లావణ్య, మల్లేశ్వరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

‘హమాలీల కూలి రేట్లు పెంచాలి’



ఫర్టిలైజర్స్ యజమానులకు నోటీసులు అందజేస్తున్న హమాలీలు

సుల్తానాబాద్, జూలై 22: సుల్తానాబాద్ పట్టణంలోని ఎరువుల దుకాణాల యజమాన్యాలు హమాలీల కూలి రేట్లను పెంచి సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ కోరారు. ఈ మేరకు సోమవారం యజమానుకుల నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సునిల్ మాట్లాడుతు నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశన్నంటాయన్నారు. కుటుంబ పోషణ హమాలీలకు భారంగా పరిణమించిందని కూలి రేట్లు పెంచి సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో రమేష్, శీనురాజా, అంజయ్య, చంద్రయ్య, శ్రీను, రవి, శివ పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, జూలై 22: పట్టణంలో బుధవారం నిర్వహించే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఫైవిం క్లయిన్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగే జన్మదినం సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో ప్రతి గ్రామం కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. మొక్కలను నాటడం, అన్నదానంతో పాటు పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో మెతుకు దేవరాజు, చెలుకలపెల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, సీహెచ్ మొగిలి, జక్కుల తిరుపతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, ఈదునూరి నర్సింగ్, చల్లా రవీందర్‌రెడ్డి, సదానందం, కుమారస్వామి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

పాలకుర్తి, జూలై 22: కేశోరాం సిమెంటు కంపెనీలోని కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరాంచాలని సోమవారం యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేనేజర్ పి పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు గత కొంతకాలంగా బేసిక్‌లు, వారికి చెందవలసిన పలు సదుపాయాలు అందడం లేదన్నారు. నష్టపోయిన కాంట్రాక్టు కార్మికులకు 22 బేసిక్‌లు సత్వరమే ఇవ్వాలని కోరారు. పదవీ విరమణ కార్మికులకు బహుమతులుగా మూడు వస్తువులను అందించాలన్నారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు అదే రోజు వారికి రావలసిన పీఎఫ్ తదితర నగదును వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

పెద్దపల్లిటౌన్, జూలై 22: పెద్దపల్లి లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పూదరి దత్తాగౌడ్ చేసిన ఉత్తమ సేవలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ జోన్ చైర్మన్ లయన్ హన్మండ్ల రాజిరెడ్డి ఉత్తమ సేవ పురస్కారం అందజేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్ లోని సత్యలక్ష్మి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో దత్తాగౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. 2023-24 లయనిస్టిక్ సంవత్సరానికి గాను 1267 మంది పేద ప్రజలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి వారి కళ్ళల్లో వెలుగులు నింపారని వారికి ఉచిత రవాణా భోజన వసతులు కల్పించారని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ గవర్నర్ లయన్ నడిపెల్లి వేంకటేశ్వర్‌రావు కొనియాడారు. సేవా కార్యక్రమాల్లో సహకరించిన లయన్స్‌క్లబ్ ఇంటర్నేషన్ 320 జీ వ్యవస్థాపక గవర్నర్, రేకుర్తి కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ కు,లయన్ కట్కూరి సత్యనారాయణకు దత్తాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉప గవర్నర్‌లు లయన్ సింహారాజు కోదండరాములు, మోర భద్రేశం పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

ఎలిగేడు, జులై 22: మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పదవీ బాధ్యతలు చేపట్టారు. 12గ్రామ పంచాయతీలలో ఎలిగేడు కొండ అంజలి, ధూళికట్ట పున్నమయ్య, బుర్హాన్‌మియాపేట్ మహేష్, లాలపల్లి వేముల సురేష్, లోకపేట మహమ్మద్ మసీదోద్దీన్, నారాయణపల్లి సాదుల పాపయ్య, నర్సాపూర్ లలిత, రాములపల్లి రాచర్ల హరిబాబు, ర్యాకల్‌దేవ్‌పల్లి ప్రమోద్‌కుమార్, శివపల్లి శ్రావణ్‌కుమార్, సుల్తాన్‌పూర్ జూపాక శివకుమార్‌లు విధుల్లో చేరారు. కాగా ముప్పిరితోట కార్యదర్శిగా ఎవరూ రాకపోవడంతో అపోస్ట్ ఖాళీగా ఉందని ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మంథని, జూలై 22: మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట్‌కి చెందిన చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి నిరుపేదలైన కుంట సమ్మక్క-సందీప అక్కచెల్లెళ్లకు మత్స్య పారిశ్రామిక మంథని అధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా డైరెక్టర్ అయిన పోతరవేని క్రాంతి ఆర్థిక సహాయం చేశారు. మంథనిలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బాధితుల ఇల్లు పూర్తిగా నేలమట్టం కావడంతో పోతరవేని క్రాంతి సందర్శించి వారి మిత్రుల సహకారంతో రూ.40వేల రూపాయలు వారికి ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద ఆడబిడ్డలను ప్రభుత్వం వెంటనే ఆదుకొని పక్కా ఇల్లును నిర్మించి ఇవ్వాలని సంబంధిత అధికారులకు, మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు.

బీసీ కులాలకు ఫెడరేషన్లు ఏర్పాటు చేయాలి

మంథని, జూల 22: 130 బీసీ కులాలకు ఫెడరేషన్లు ఏర్పాటు చేసి, బడ్జెట్ కేటాయించి చైర్మన్లను నియమించి పాలక మండలిలను ఏర్పాటు చేయాలని సోమవారం మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు క్యాంప్ కార్యాలయంలో బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో పీఏ ఆకుల చంద్రశేఖర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. బీసీ కులాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కామారెడ్డి వేదికగా జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల మ్యానిఫెస్టోలో అభయహస్తం లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు. కలెక్టర్ అధ్యక్షతన బీసీ సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీ కులాల్లో ఏబీసీడీ వర్గీకరణ జరపాలని కోరారు. బీసీ కులాలకు చేతివృత్తులకు రక్షణ చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గూటికారి కిషన్‌జీ, కావేటి సమ్మయ్య, పరిసవేని మోహన్ మంథని సురేష్, గుండా రాజు, పోతరాజు సమ్మయ్య, బోయిని నారాయణ, రామ్మూర్తి, బజారు మల్లేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి రూరల్, జూలై 22: రాష్ట్రంలోని ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని, బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి చేర్చాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో హామీ ఇచ్చినట్టుగా ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ మహసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రేండ్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. దీంతో పాటు మత్స్యకారుల అభివృద్ధికి వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు, తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాఘవాపూర్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్, అప్పన్నపేట సొసైటీ అధ్యక్షుడు నీలి సతీష్, పిడుగు రవి, మధు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

గురువుకు సన్మానం

మార్కండేయాలనీ, జూలై 22: గోదావరిఖని విఠల్‌నగర్ 1964సంవత్సరంలో శ్రీదేవి విద్యానికేతన్ స్థాపించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన పాపయ్య శాస్త్రి పంతులును గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. పాపయ్య శాస్త్రి పంతులు ఇంటికి వెళ్లి రూ.5,500 ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పంతులు దంపతులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో జెల్ల కుమార్, కన్నవేణ కనకరాజు, అబ్దుల్ గఫూర్, ఆకుల వీరేశం, గుండబోయిన అజయ్, కుక్కల రాజయ్య, తాటికొండ శ్రీనివాస్, గాజుల అంజయ్య వాసంపల్లి ఆనంద్, బంగారు రమేష్, మేకల దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

పెద్దపల్లిటౌన్, జూలై 22: పట్టణం లోని శాంతి నగర్ కాలువ కట్టకు చెందిన నిరుపేద కుటుంబానికి విజ్ఞన్న యువసేన ఆధ్వర్యంలో బియ్యం అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బొంకూరి నాగమణికి చెందిన ఇళ్ళు పూర్తిస్థాయిలో కూలి పోయింది. సమాచారం తెలుసుకున్న విజ్ఞన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం వినోద్ రెడ్డితన అనుచరులతో 50 కేజీ కిలోల బియ్యంతో పాటు వెయ్యి రూపాయల నగదు అందజేనశారు. ఈ కార్యక్రమంలో బొంకూరి కమల, నాగమణి, చోటు, కుమార్, సతీష్, అహ్మద్ తదితరుల పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతులకు రూ.1.61కోట్లు



ఎలిగేడులో పాఠశాలలో పూర్తయిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

ఎలిగేడు, జూలై 22: ప్రభుత్వ పాఠశాలలో అహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంట్లో భాగంగా ఎలిగేడు మండలంలోని 17 ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా భవనాల సాధారణ మరమ్మతులు, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కోటి 61లక్షల37వేల334 రూపాయలను మంజూరు చేసింది. లాలపల్లి పీఎస్‌కు రూ.10.03 లక్షలు, సుల్తాన్‌పూర్ పీఎస్ఎస్సీ కాలనీ రూ.3.83, లక్షలు, హైస్కూల్‌కు రూ.14.88 లక్షలు, పీఎస్‌కు రూ.5.82 లక్షలు, బురహాన్‌మియాపేట్ యూపీఎస్‌కు రూ.11.03 లక్షలు, లోకపేట పీఎస్‌కు 12.81 లక్షలు, ధూళికట్ట హైస్కూల్‌కు రూ.15.35 లక్షలు, శివపల్లి ఎస్సీ కాలనీ పీఎస్‌కు రూ.19.26లక్షలు, యూపీఎస్‌కు రూ.11.83 లక్షలు, నర్సాపూర్ యూపీఎస్‌కు రూ.10.90 లక్షలు, ఎలిగేడు హైస్కూల్‌కు రూ.18.22 లక్షలు, పీఎస్‌కు రూ.5.75 లక్షలు, పీఎస్ ఎస్సీ కాలనీ రూ.7.79 లక్షలు, ర్యాకల్‌దేవ్‌పల్లి యూపీఎస్‌కు రూ.10.65 లక్షలు, రాములపల్లి పీఎస్‌కు రూ.2.60లక్షలు, మల్లయ్యపల్లి పీఎస్‌కు రూ.2.07 లక్షలు, ముప్పిరితోట పీఎస్‌కు. రూ.7.60 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఆయా పాఠశాలలోని పనులను గ్రామాల్లోని మహిళ సంఘాల వీవో అధ్యక్షుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఇప్పటివరకు 90 శాతం వరకు భవనాల మరమ్మతులతో పాటు ఇతరత్ర పనులు పూర్తయినట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు, పీఆర్ ఏఈ జగదీశ్వర్, ఐకేపీ ఏపీఎం సుధాకర్, ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ముత్తారం జూలై 22: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ సోమవారం పరిశీలించారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన ఆహారం మెనూ ప్రకారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ముత్తారం మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజిద్‌పాషా, మాజీ వార్డు సభ్యుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో జాతీయ జెండాతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్, జూలై 22: జాతీయ పతాక అమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలో విద్యార్థులతో కలసి వంద మీటర్ల పొడవు గల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐబీ చౌరస్తా వద్ద ఈ ర్యాలీకి మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్, లయన్స్‌క్లబ్ ఉప గవర్నర్ సింహరాజు కోదండ రాములు, సుల్తానాబాద్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్ తదితరులు ప్రారంభించారు. స్థానిక రాజీవ్ రహదారితో పాటు పట్టణ పురవీధుల గుండా జాతీయ జెండాతో స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, వల్స నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, పట్టిల వెంకటేశం, సాంబమూర్తి, గజబీంకార్ జగన్, నాగమల్ల ప్రశాంత్, చకిలం వెంకటేశ్వర్లు, స్కూల్ డైరక్టర్ మాటేటి క్రిష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు,

టాస్క్ భవనం పరిశీలన

పెద్దపల్లిటౌన్, జూలై 22: టాస్క్ భవనం ఆధునీకీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను సూచించారు. కలెక్టర్ శ్రీహర్ష పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని టాస్క్ భవనాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించి, ఆధునీకీకరణ పనులను తనిఖీ చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టాస్క్ భవనంలో పూర్తి చేసిన ఫ్లోరింగ్, మెట్లకు వుడెన్ టైల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

‘అల్ఫోర్స్’లో బోనాల వేడుకలు

సుల్తానాబాద్, జూలై 22: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలో సోమవారం బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయలకు నిలయంగా తెలంగాణ దేశంలోనే ప్రసిద్ధి చెందిదన్నారు. బోనాల పండుగ విశిష్టతను విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పోతరాజుల విన్యాసాలు, నృత్యాలు, భవిష్యవాణి ఆకట్టుకున్నాయి. అందరూ బోనాలు తలపై ఎత్తుకుని అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి నిధుల మళ్లింపుపై నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 22: సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో ఏఐటీయూసీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రాజీవ్‌గాంధీ అభయహస్తం పేరిట సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల చొప్పున ఇవ్వాలనే నిర్ణయం సరికాదని నాయకులు పేర్కొన్నారు. కార్మికులు శ్రమించి సంస్థను లాభాల్లో తీసుకువస్తుంటే అధికారంలో ఉన్న పార్టీలు సింగరేణి సొమ్మును ఇతర పథకాలను దారి మళ్లించడం సంస్థ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తుందని అన్నారు. సింగరేణి నిధులను సంస్థ ప్రాజెక్టుల విస్తరణ, కార్మిక వాడల్లో వసతులు, ప్రభావిత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో కేంద్ర కార్యదర్శి రాజారత్నం, పిట్ సెక్రెటరీ ఎజ్జ రాజయ్య, నాయకులు మహేందర్, పోషన్న, నల్ల మధు, మహేందర్, ఆంజనేయులు, మధు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జీఎం పరామర్శ

రామగిరి, జూలై 22: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు సోమవారం రాత్రి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సింగరేణి సంస్థపరంగా అండగా ఉంటామన్నారు. అధైర్యపడవద్దని కుటుంబానికి భరోసా ఇచ్చారు. అధికారులు ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, మురళి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నేతలు వైవీ రావు, కోట రవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జీఎం, అధికారులు

సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి యాజమాన్యం తోడ్పడాలి - టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూలై 22: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని నిర్వీర్యం చేస్తుందని, కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మారుస్తున్న కార్మికులకు సౌకర్యాలు కల్పించడం లేదని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రాణాలను పనంగా పెట్టి సంస్థ అభివృద్ధిలో భాగమవుతున్న సింగరేణి కార్మికుల పిల్లలకు విద్యను అందించడంలో సింగరేణి యాజమాన్యం తోడ్పాటు అందించడం లేదని, ప్రభుత్వ అనాలోచిత పథకాలకు డబ్బులు కేటాయించడం దుర్మార్గమైందన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రభుత్వ కుట్రలకు తలొగ్గి సివిల్స్‌కు సమాయత్తం అవుతున్న సింగరేణేతరులు 400మందికి లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించడాన్ని టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సింగరేణిలో విద్యాసంస్థలను మూసివేసి కార్మికుల పిల్లల అభ్యున్నతికి అడ్డుకట్ట వేశారని, కార్మికులు తమ పిల్లలను ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివిస్తూ లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, సింగరేణి కార్మికుల పిల్లలపై యాజమాన్యం సీతకన్ను వేసిందన్నారు. సింగరేణి కార్మికవాడల్లో సీబీఎస్ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు కోరినా యాజమాన్యం పట్టించుకోవడంలేదని, సింగరేణి సంపదను ఇతర ప్రాంతాలకు దోచిపెట్టే చర్యలు సరైనవి కాదన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులు, సింగరేణి కళాశాలలు, కార్పొరేట్ స్థాయి ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలను సింగరేణిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.4కోట్లు రాజీవ్ గాంధీ అభయ హస్తం ద్వారా నిధులు మళ్లించడం సరైంది కాదని, ఇప్పటికైనా యాజమాన్యం సింగరేణి నిధులతో సింగరేణి కార్మికుల పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, నాయకులు సంపత్‌రెడ్డి, చల్లా రవీందర్, చెలుకలపెల్లి శ్రీనివాస్, సురేందర్, శేషగిరి, శ్రీకాంత్, ఐలయ్య, రహమాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

● **బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..**

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఓసీపీ-2లో సోమవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి ఒకే కుటుంబంగా బావించడం మరిచి.. అధికారులు, కార్మికులు వేరే అనే చందంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రమాదానికి రెండు రోజుల ముందుగా అదే దారి నుంచి వెళ్లిన జీఎం, ప్రాజెక్టు అధికారి దానిపై దృష్టి పెట్టకపోగా అదే ప్రాంతంలో పనులకు పురమాయించడం మూలంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ప్రమాదకరంగా ఉందని ముందుగానే వెంకటేశ్వర్లు అధికారులకు తెలిపినప్పటికి పెడచెవిన పెట్టారని ఆరోపించారు. ఓసీపీ-2 ఘటనకు బాధ్యులైన అధికారులపై కఠినచర్యలు చేపట్టాలని లేని పక్షంలో టీబీజీకేఎస్ పక్షాన ఆందోలన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పింగిళి సంపత్‌రెడ్డి, దేవశ్రీనివాస్,సాంబయ్య, పాశం శ్రీనివాస్, దాసరి మల్లేష్, రమేశ్, సదానందం, శంకర్ పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్లను తనిఖీ చేసిన జీఎం

గోదావరిఖని, జూలై 22: గోదావరిఖని నగర అభివృద్ధి పనుల్లో భాగంగా హనుమాన్‌నగర్, శివాజీనగర్, అశోక్‌నగర్ ఏరియాల్లో తొలగించే క్వార్టర్లను సోమవారం ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ తనిఖీ చేశారు. క్వార్టర్ అలాట్‌మెంట్ కమిటీ బృందంతో కలిసి ఉద్యోగులు నివాసముంటున్న క్వార్టర్లకు వెళ్లి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎంచుకున్న క్వార్టర్లకు త్వరితగతిన మరమ్మతులు చేస్తున్నామని, మంగళవారం మరోసారి ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించిన స్పెషల్ కౌన్సిలింగ్‌కు కార్మికులు తప్పకుండా హాజరై క్వార్టర్లను తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏజీఎం (పర్సనల్) లక్ష్మీనారాయణ, సర్వే అధికారి ప్రభాకర్, డీజీఎం(వర్క్‌షాప్) జితేందర్‌సింగ్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఎస్టేట్ అధికారి సాంబశివరావు, డీవైఎస్ఈ వరప్రసాద్ ఉన్నారు.



క్వార్టర్లను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్